క్లుప్తంగా

రేపు లక్ష్మీచెన్నకేశవుడికి లక్షపుష్పార్చన



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామికి ఆషాఢ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని గురువారం లక్షపుష్పార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం తెల్లవారుజామున 6 గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుణ్యాహవాచనము, రుత్విక్వరణములు నిర్వహించిన అనంతరం 10.30గంటల నుంచి 3 గంటల వరకు లక్షపుష్పార్చన చేయనున్నట్లు చెప్పారు. సాయంత్రం 4గంటలకు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, 8గంటలకు ప్రజాదోషపూజ, శయనోత్సవం చేయనున్నారు. శుక్రవారం ఉదయం 7గంటలకు సహస్రనామార్చన, 8గంటలకు మహానివేదనతో కార్యక్రమం ముగుస్తుందన్నారు. లక్షపుష్పార్చన కార్యక్రమం రుత్వికులతో వైభవంగా నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం

జడ్చర్ల టౌన్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ హరిజనవాడ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఉచిత కుట్టు శిక్షణను కౌన్సిలర్లు శ్రీశైలమ్మ, రమేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం తగదు




కోయిల్‌కొండ: ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నారాయణపేట నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు స్థాయికి మించి ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు వాసురాథోడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రాజేందర్‌రెడ్డి మరోసారి విజయం సాధించడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. నాయకులు వెంకట్‌నాయక్,శంకర్‌నాయక్, రామునాయక్, నర్సింగ్, గోవిందు, గంగ్యానాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల వర్కర్స్‌పై దాడి

మహమ్మదాబాద్: పిలిచిన వెంటనే గేట్ తీయలేదని ఆశ్రమపాఠశాలలో పనిచేసే వర్కర్స్‌పై ఓ విద్యార్థి తల్లిదండ్రులు దాడి చేసిన ఘటన మంగళవారం మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నభోజన సమయంలో పాఠశాలకు గేటు వేసిపెట్టారు. అదే సమయంలో అక్కడకు ఓ విద్యార్థి తల్లిదండ్రులు ఆమెను వదిలిపెట్టేందుకు వచ్చారు. గేటు తెరవమని వర్కర్లను అడిగితే, విద్యార్థులు తింటున్నారు కొద్దిసేపు ఆగండి అని చెప్పడంతో ఆగ్రహించారు. గేటు తీసిన వెంటనే అక్కడ ఉన్న వర్కర్‌ను దూషించారు. అక్కడే ఉన్న ప్రభుత్వ ఉద్యోగి చంద్రకళపై దాడిచేయబోగా ఆడవారిపై దాడి చేస్తావా అంటూ తిట్టడంతో అక్కడే ఉన్న విద్యార్థిని తల్లి దూరంగా నెట్టింది. అంతటితో ఆగకుండా కిందపడిన చంద్రకళపై పిడిగుద్దుల వర్షం కురిపించిం తీవ్రంగా గాయపరచడంతో స్పృహకోల్పోయింది. దీంతో తోటి వర్కర్‌లు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. ఈవిషయంపై మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడిచేసిన విద్యార్థి తల్లిదండ్రులపై వెంకటే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కురుమూర్తిలో మాజీ డిప్యూటీ మేయర్



చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తి స్వామిని మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనను శాలువతో సత్కరించారు. అనంతరం ఈనెల 29 ఆత్మకూర్‌లో నిర్వహించే బీజేపీ బహిరంగ సభకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వచ్చే రూట్ మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. నాయకులు నరాల నారాయణ, అశోక్, చిన్నచింతకుంట మండల పార్టీ అధ్యక్షుడు దశరత్, మధు, మనోహర్, మాసన్న, మల్లేష్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించరా?

- వచ్చే నెల కరెంటు బిల్లులు కట్టం
- సమావేశానికి అధికారులు రాకపోతే ఎలా?
- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాధవి

గండేడ్: ఎంపీపీ మాధవి అధ్యక్షతన ఉమ్మడి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పదవి చేపట్టి, దిగిపోయే సమయం వచ్చినా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడం లేదంటూ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరు బాగోలేదని, ముఖ్యంగా విద్యుత్ శాఖపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించడం లేదని, అలాంటప్పుడు సమావేశాలు ఎందుకు అంటూ నిలదీశారు. ప్రతిసారీ కొత్త అధికారి సమావేశానికి రావడం ఏదో ఒక సమాధానం చెప్పి వెళ్లిపోవడం తప్పిస్తే ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. కొండాపూర్ చెరువులో నుంచి వెళ్లే విద్యుత్ లైను వైర్లు కిందికి వేలాడుతున్నాయని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆశిరెడ్డిపల్లిలో తాగునీటి సరఫరా కోసం అవసరమైన విద్యుత్ లైను ఏర్పాటు చేయడం లేదని, జిన్నారంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్ ఆఫ్ ఏర్పాటు లేదని సర్పంచులు గోపాల్, ఖాజన్న తెలిపారు. కొంరెడ్డిపల్లి, లింగాయిపల్లిలోనూ సమస్యలు పరిష్కరించడం లేదని సర్పంచ్‌లు ప్రభాకర్, వెంకటయ్య పేర్కొన్నారు. బోర్లు, కరెంటు కనెక్షను లేకున్నా చనిపోయిన వారి పేరిట రూ.వేలల్లో బిల్లులు వేస్తున్నారని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎంపీటీసీ బాలయ్య, సర్పంచులు జితేందర్‌రెడ్డి, గోపాల్ సభదృష్టికి తీసుకువచ్చారు. ప్రతినెలా గ్రామపంచాయతీల నుంచి బిల్లులు కడుతున్నామని, సమస్యలు పరిష్కారం చేయకపోతే ఇకనుంచి కట్టమని తేల్చి చెప్పారు. లైనుమెన్లు స్థానికులు కావడం వల్ల సరైన రీతిలో స్పందించడం లేదని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఏఈ శ్రీకాంత్ స్పందిస్తూ జంగంరెడ్డిపల్లిలో సమస్యలు బుధవారం పరిష్కరిస్తామని అన్నారు. మిగతా గ్రామాల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. లైనుమెన్ల వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. గ్రామాల్లో కేసులు విజిలెన్సు వారు చేస్తున్నారని తమకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలో అన్ని క్రిమిటోరియాలకు తక్షణమే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఏఈని కోరారు. ఉమ్మడి మండలాన్ని నారాయణపేట్ డివిజన్ నుంచి మహబూబ్‌నగర్‌కు మార్చాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గాధిర్యాల్‌లో ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉందని డిప్యుటేషన్‌పై కేటాయించాలని సర్పంచ్ వెంకట్‌రాం రెడ్డి, మంగంపేట్ తండాలో పుస్తకాలు సరిపోయినంతగా రాలేదని సర్పంచ్ గీత పేర్కొన్నారు. ఎంఈఓ వెంకటయ్య మాట్లాడుతూ వెంటనే పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా చాలా గ్రామాల్లో బీటీ రోడ్లు నత్తనడకన సాగుతున్నాయని, కొన్ని అసలే ప్రారంభించలేదని, గ్రామపంచాయతీ నిర్మాణాలకు స్థలం చూయించాలని సర్పంచులు కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ త్వరలో పరిష్కరిస్తామన్నారు. పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందంటూ సభ్యులు తెలిపారు. గ్రామాల్లో హరితహారంపై దృష్టిసారించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశాలకు తప్పని రావాలని, సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, తహసీల్దార్లు జ్యోతి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..



సాక్షిలో ప్రచురితమైన కథనం

గండేడ్: మండలంలోని కేజీబీవీలో నెలకొన్న సమస్యలపై మంగళవారం సాక్షిలో 'కేజీబీవీ.. గజిబిజి' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ప్రజాప్రతినిధులు స్పందించారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో విషయంపై చర్చ జరిపారు. ఎంపీపీ మాధవి సాక్షి పత్రికను చూయిస్తూ కేజీబీవీలో ఇన్ని సమస్యలు ఉంటే పట్టించుకోకపోతే ఎలా అంటూ ఎంఈఓను నిలదీశారు. పెద్ద పెద్ద అక్షరాలతో కథనాలు వస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఫిల్టర్ పనిచేయడం లేదని విద్యార్థులకు బోరునీళ్లు ఇచ్చి, ఉపాధ్యాయులకు ఫిల్టర్ వాటర్ వాడడం ఎంతవరకు సబబు అన్నారు. ఎంఈఓ సమాధానం ఇస్తూ ఐసీఐసీ ఫౌండేషన్ వారు ఫిల్టర్ యూనిట్ మంజూరు చేస్తామని చెప్పడంతో ఆగామన్నారు. ఉపాధ్యాయులు సమయానికి రాకపోతే పిల్లల భవిష్యత్తు ఏంకావాలని ఎంపీపీ, జెడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేయగా, సోమవారం పాఠశాలను సందర్శించానని సమస్యలపై డీఈఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. పాఠశాలలో పనిచేయని బోరుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంటనే ఫ్లషింగ్ చేయించేలా చూడాలని అన్నారు. పాఠశాలను తనిఖీ చేయాలని నిర్ణయించుకున్నామని అంతలోపే సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చినందుకు సాక్షికి ఎంపీపీ ధన్యవాదాలు తెలిపారు. ఇక నుంచి ఉపేక్షించమని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డిలతో రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తామని పేర్కొన్నారు.

స్వచ్ఛత యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛత యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణ లోని మెప్మా భవనంలో ఐదుగురు సీఓలు, 90 మంది ఆర్‌పీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మహిళా సంఘం సభ్యులు, ప్రజలందరూ భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–23కు సంబంధించి సిటిజన్ ఫీడ్ బ్యాక్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 16వ తేదీ వరకు దీనిపై ఓటింగ్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ యాప్‌లో తమ అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. మహబూబ్‌నగర్‌కు స్వచ్ఛతలో మెరుగైన ర్యాంకు వచ్చేందుకు అందరూ సహకరించాలన్నారు. అంతకుముందు ఈ యాప్‌పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఓటు ఎలా నమోదు చేయాలో వారికి వివరించారు. కార్యక్రమంలో సీఓలు ఆంజనేయులు, నిర్మల, వరలక్ష్మి, యాదయ్య, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



సమావేశంలో డీఏఓ వెంకటేశ్ తదితరులు

జడ్చర్ల: వానాకాలం సీజన్ పంటల సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో నిర్వహించిన విత్తన, ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విత్తనాలకు సంబంధించి హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ సేల్ వ్యాపారులకు స్టాక్ పంపిన వెంటనే ఆర్‌ఓలు జనరేట్ చేయాలన్నారు. ఎరువులకు సంబంధించి దిగుమతి చేసుకున్న వెంటనే సేల్స్ ఆఫీసర్ డీలర్ల వారీగా ఎంతమేరకు కేటాయించారో తెలియజేయాలన్నారు. విక్రయాల్లో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని కోరారు. తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, దుకాణాల్లోని ధరల పట్టికలతో పాటు నిల్వ పట్టికలను నిర్వహించాలన్నారు. లూజు విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు రికార్డులు, బిల్లులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. తనిఖీల సమయంలో అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏడీఏ ఆంజనేయులు, ఏఓ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పనులకు పంచాయతీ ట్రాక్టర్!

మిడ్జిల్: గ్రామ పంచాయతి ట్రాక్టర్‌ను కొందరు ప్రైవేట్ పనులకు వినియోగిస్తున్నట్లు రాణిపేట్ గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గ్రామంలో క్రీడా ప్రాంగణానికి కేటాయించిన ప్రభుత్వ స్థలం నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు వివరించారు. పంచాయతి కార్యదర్శి సుదర్శన్‌ను వివరణ కోరగా తాను సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: కొత్తపల్లి గ్రామ శివారులోని దుందుభి వాగు నుంచి మంగళవారం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌లాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

న్యాయం చేయండి మహాప్రభో!



వినతి పత్రం అందిస్తున్న రైతులు

నవాబుపేట: పోమాల్ రైతులు తహసీల్దార్ రాజేందర్‌రెడ్డిని కలిసి తమ ధాన్యంలో మిల్లర్లు కోతలు విధించారని చాలా నష్టపోయామని, న్యాయం చేయాలని మంగళవారం కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నష్టపోయిన డబ్బుల విషయంలో పూర్తి సమాచారం అందించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే డబ్బులు ఇలా కోతలు విధిస్తే ఎలా అని వాపోయారు. వ్యవసాయ అధికారికి సైతం సమస్యను వివరించినట్లు రైతులు తెలిపారు. రైతులు యాదగిరి, వెంకటేష్, నర్సింహులు, వీరారెడ్డి, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మిడ్జిల్: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తాలుకా స్థాయి క్విజ్ పోటీల్లో మిడ్జిల్ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు రవళి, గీత ప్రతిభ చాటి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం రవికుమార్ తెలిపారు. విద్యార్థులకు బహుమతి, ప్రశంసా ప్రతాలు అందజేశారని వివరించారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు.

ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రహమానియా ఈద్గా వద్ద ఈనెల 29న నిర్వహించే బక్రీద్ ప్రత్యేక ఈదుల్‌జుహా నమాజ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ చైర్మన్ కేసీ.నర్సిములు, ఈద్గా కమిటీ ప్రతినిధులు పరిశీలించారు. ఈద్గా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ నమాజ్‌కు వచ్చే ముస్లింల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, వక్ఫ్ ప్రొటెక్షన్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తఖీ హుస్సేన్, హాఫిజ్ ఇద్రీస్, కోశాధికారి గౌస్‌పాషా, ఖాదర్‌పాషా, నాయకులు ఖాజాపాషా, రాశెద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి: కలెక్టర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ జి.రవి నాయక్ సూచించారు. మంగళవారం భారత సేవాశ్రమ సంఘం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వడం హర్షణీయమన్నారు. వసతి గృహానికి చెందిన విద్యార్థులు పదోతరగతిలో ఎక్కువ మార్కులు సాధించడం అభినందనీయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, డీఈఓ రవీందర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు నటరాజు, వైస్ చైర్మన్ డా.శామ్యూల్, భారత సేవాశ్రమ సంఘం ప్రతినిధి స్వామి మునీశ్వరానందజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

నవాబుపేట: తాగి వాహనాలు నడపరాదని ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మారక పోవటంతో పోలీసులు ఒక వ్యక్తిని కోర్టులో హాజరుపరిచారు. దీంతో జడ్జి మంగళవారం అతడికి రిమాండ్ విధించారు. ఎస్ఐ పురుషోత్తం తెలిపిన ప్రకారం.. సరూర్‌నగర్ (హైదరాబాద్)కు చెందిన తిరుపతయ్య మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడగా కోర్టుకు తరలించారు. దీంతో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్పెషల్ జడ్జి నిర్మల అతడకి 4 రోజుల సాధారణ జైలుశిక్ష, రూ. రెండువేలు జరిమానా విధించారు. దీంతో అతడిని జైలు తరలించామని ఎస్ఐ వివరించారు.

పేదలందరికీ 'డబుల్ ఇళ్లు' ఇవ్వాలి



మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు



అడ్డాకులలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడారు. ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. పేదల సమస్యలను పరిష్కరించకపోతే జూలై 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని అన్నారు. అనంతరం తహసీల్దార్ పాండుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి ధర్నానుద్దేశించి మాట్లాడుతూ ఇంటి స్థలం లేని వారికి స్థలాలను మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.600లు చెల్లించాలని కోరారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు, స్కీం వర్కర్లు, వీఓఏలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశావర్కర్ల వేతనాలను పెంచాలని అన్నారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజు, కాశీమ్, ప్రసాద్, జీవరత్నం, హనుమంతు, మోహన్, రమేష్, ప్రవీన్, ప్రేమ్, నాగార్జున, అంజి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బకెట్ల పంపిణీ

మహబూబ్‌నగర్ రూరల్: బండమీదిపల్లి సమీపంలోని సాందీపని ఆవాసంలో విద్యార్థులకు బకెట్లు, మగ్గులను బండారు పీఠం నిర్వాహకులు కొంగల పాండు ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పేద విద్యార్థులు సాందీపనిలో చదువుకుంటున్నారని, ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తైద శ్రీను, పుట్ట శివయాదవ్, యాదయ్య, సంజయ్‌కుమార్, బోయ రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయ డెయిరీ ప్రారంభోత్సవం

గండేడ్: మండల కేంద్రంలో నిర్మించిన విజయ డెయిరీని బుధవారం నాడు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తెలిపారు. రూర్బన్ నిధులతో దీనిని నిర్మించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవం ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి , మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



రాచాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న అధికారులు

అడ్డాకుల: మండలంలోని కందూర్, పొన్నకల్, రాచాల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ కిషన్, ఎస్ఐ మాధవరెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, ఇతర మౌళిక వసతులను పరిశీలించారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో విద్యాబోధనను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. రాచాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అక్కడే భోజనాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీకాంత్, తిరుపతయ్య యాదవ్, గిర్దావర్ సాహత్ ఇషాన్, పీఈటీ రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మిడ్జిల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు, నర్సింహులు, తిరుపతయ్య, జంగయ్య, యాదయ్య, భగవంత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మానవతకు దర్పణం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 52 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. వారిని అధికారులు అభినందించారు. రక్తదానం మానవతకు దర్పణమని అన్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాన్ని కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్లు రాంజీ, ప్రభుత్వ మెడికల్ కళాశాల నావెల్ కిషోర్, మధుసూదన్‌రెడ్డి, జీఎల్‌గౌడ్, ఎంఆర్.గౌడ్, చంద్రమోహన్‌గౌడ్, శివరాణి, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



నాయకులను సన్మానిస్తున్న కార్యకర్తలు

నవాబుపేట: కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉండి అందలం ఎక్కిస్తుందని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో పీసీసీ అధికార ప్రతినిధిగా ఎంపికైన యన్మన్‌గండ్ల గ్రామానికి చెందిన జహీర్ అక్తర్ సన్మాన సభలో మంగళవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచి బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించిన జహీర్‌ను పార్టీ గుర్తించి పీసీసీ బాధ్యతలు అప్పగించటం గొప్ప విషయమని వివరించారు. సామాన్య కార్య కర్తకు కాంగ్రెస్ ఇచ్చే బహుమానం ఇలా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని, వారి హక్కుల కోసం పోరాటం చేస్తుందని వివరించారు. అనంతరం మండల నాయకులు గజమాలతో పీసీసీ అధికారప్రతినిధి జహీర్ అక్తర్‌ను ఘనంగా సన్మానించారు. జిల్లా సీనియర్ ఉపాధ్యక్షుడు రంగా రావు, రాష్ట్ర నాయకులు బాబర్, రాజేష్, ఖాజా, ఎంపీటీసీ రాంచందర్, రాజేష్, షబ్బీర్, శ్రీహరి, రమేస్, మూనోద్దీన్, వెంకటయ్య, సత్యం, మణి తదితరులు పాల్గొన్నారు.